సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

కేరళ ప్రభుత్వం పట్ల

కేంద్రం కక్షపూరిత చర్యలు

- సంఘీభావ సభలో ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేరళ ప్రభుత్వం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరితమైన చర్యలు మానుకోవాలని కేరళకు అందించాల్సి సహాయం అందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు కేంద్ర కమిటీలు ఇచ్చిన ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా కేరళ సంఘీభావ సభను కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్,సిఐటియు న్యూసిటీ కార్యదర్శి సిహెచ్‌సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్ర ప్రభుత్వం పట్ల అనుసరిస్తున్న విధానాలు సరైనవి కావని అన్నారు. కేరళ ప్రభుత్వానికి అందాల్సిన ఆర్థిక సహాయం అందజేయకుండా ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేసే పద్ధతుల్లో వ్యవహరిస్తుందని విమర్శించారు. కేంద్రం నుంచి కేరళ ప్రభుత్వానికి దాదాపు రూ.లక్ష కోట్ల ఆర్థిక సహాయం అందాల్సి ఉందని, సహాయం అందజేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. గతంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఇతర ముఖ్యమంత్రులు కలుపుకొని ఢిల్లీలో ఆందోళన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వయనాడు ప్రాంతంలో వచ్చిన విపత్తువల్ల 400 మంది మరణించారని, వారికి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వం ఎంతో ఆదర్శవంతంగా పనిచేస్తుందని అన్నారు. విద్యా విషయంలో నూరుశాతం అక్షరాస్యత సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 36వేల మందికి భూ పంపిణీ చేసిందని, కార్మికులకు బాసటగా నిలుస్తూ కనీస వేతనాలు అమలు చేయడం ఫ్యాక్టరీలు మూతపడకుండా కాపాడడం లాంటి చర్యలు చేపడుతుందని తెలిపారు. రోజుకు కనీస వేతనం రూ.720 కొనసాగిస్తుందని తెలిపారు. మోడల్ రాష్ట్రంగా చెబుతున్న గుజరాత్‌లో రోజువారి వేతనం రూ.300 మాత్రమే ఉందని అన్నారు. వ్యవసాయ కార్మికులకు వ్యవసాయ బోర్డు ద్వారా సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వరికి కనీసం మద్దతు ధర రూ.2,800 చెల్లిస్తుందని అన్నారు. ఎంతో ఆదర్శవంతమైన పరిపాలన కొనసాగిస్తున్న కేరళ ప్రభుత్వం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మానుకోకపోతే దేశవ్యాప్తంగా ప్రజల్లో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. వాయనాడు ప్రాంతంలో వచ్చిన విపత్తుకి దేశవ్యాప్తంగా అనేకమంది ప్రజలు సహాయం అందజేసిన పరిస్థితి ఉన్నదని ఆ రకంగానే కేరళకు దేశవ్యాప్త ప్రజలు బాసటగా నిలిచే విధంగా ప్రజల్లోకి విధానాలు తీసుకుని వెళ్లాలని ఆయన కోరారు. సిఐటియు నగర కమిటీ అధ్యక్షులు నరసింహులు, ఓల్డ్‌సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, న్యూ సిటీ నాయకులు మహమ్మద్‌రఫీ, సుధాకరప్ప కర్నూలు మండల సిఐటియు నాయకులు హుసేనయ్య, నాయకులు రైతు సంఘం నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

చార్జీల వాత..!



- ట్రూ అప్, సర్దుబాటు చార్జీల బాదుడు
- వాడకం తగ్గినా మోగిన విద్యుత్ బిల్లు
- బిల్లులో రూ.150 నుంచి రూ.350 వరకూ పెరుగుదల

ఆదోని నగరంలోని క్రాంతి నగర్‌కు చెందిన ఓ విద్యుత్ వినియోగదారునికి గత నెల 56 యూనిట్లకు రూ.190 బిల్లు రాగా ఈ నెల 47 యూనిట్లు వాడినా రూ.276 బిల్లు వచ్చింది. అందులో ఎఫ్‌పిపిసిఎ (2022-04) పేరుతో రూ.54.14, ఎఫ్‌పిపిసిఎ (2024-10) పేరుతో రూ.24, ట్రూ అప్ పేరుతో రూ.21.93 బిల్లు వేశారు. అంటే ఈ అదనపు ఛార్జీలే రూ.100.07 పడ్డాయి. ఇలా ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం జనంపై పెనుభారం మోపింది. గత నెల బిల్లుకంటే విద్యుత్ వాడకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.350 వరకూ అదనంగా వచ్చిన పరిస్థితి ఉంది. డిసెంబర్ రెండో తేదీ నుంచి విద్యుత్‌శాఖ కరెంటు బిల్లులు తీస్తుంది. ఆ బిల్లులు చూసి సామాన్యులు హడలిపోతున్నారు. అప్పుడు వైసిపి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమపై విద్యుత్ భారాలు మోపుతూ వికట్టహాసం చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్, సర్దుబాటు భారం మోపింది. డిసెంబర్‌లో ఇస్తున్న బిల్లుల నుంచి ఈ బాదుడు మొదలుపెట్టింది. జనవరిలో అదనంగా మరో ఛార్జీ మోతకు ఇప్పటికే అన్నీ సిద్ధం చేసింది. దీంతో జనానికి ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

కర్నూలు నగరంలోని లక్ష్మీ నగర్‌కు చెందిన ఓ విద్యుత్ వినియోగదారునికి గత నెలలో 230 యూనిట్లకు రూ.687 విద్యుత్ బిల్లు రాగా ప్రస్తుతం 205 యూనిట్లు వాడినా ఏకంగా రూ.1221 బిల్లు వచ్చింది. శీతాకాలం కావడంతో గతం కంటే తక్కువ విద్యుత్ వినయోగించినా కూడా రూ.534 అధిక బిల్లు వచ్చింది. అందులో ఎఫ్‌పిపిసిఎ (2022-04) పేరుతో రూ.146.42, ఎఫ్‌పిపిసిఎ (2024-10) పేరుతో రూ.56.40, ట్రూ అప్ పేరుతో రూ.38.76 బిల్లు వేశారు. ఈ చార్జీలే రూ.241.58 పడ్డాయి.

కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ఓ విద్యుత్ వినియోగదారునికి గత నెల రూ.712 బిల్లు రాగా ఈ నెల రూ.943 బిల్లు వచ్చింది. అందులో ఎఫ్‌పిపిసిఎ (2022-04) పేరుతో రూ.60.40 వసూలు చేశారు. అదే వీకర్ సెక్షన్ కాలనీలోని మరో విద్యుత్ వినియోగదారునికి గత నెల రూ.113 బిల్లు రాగా ఈ నెల రూ.164 విద్యుత్ బిల్లు వచ్చింది. అందులో ఎఫ్‌పిపిసిఎ (2022-04) పేరుతో రూ.45.52, ఎఫ్‌పిపిసిఎ (2024-10) పేరుతో రూ.9.60, ట్రూ అప్ పేరుతో రూ.21.37 బిల్లు వేశారు. ఎనర్జీ ఛార్జీలు రూ.51.30 పడగా మిగిలినంతా అదనపు భారమే...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 12 లక్షల వరకూ గహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానివే. రెక్కాడితేగాని, డొక్కాడని కుటుంబాలు అనేకం ఉన్నాయి. విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వాలు జనాన్ని పీక్కుతింటున్నాయి. వాడుకున్న కరెంటుకు కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి, సర్‌ఛార్జీ, ఇడి ఐఎన్‌టి, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీల పేరుతో వీర బాదుడు బాదుతోంది. వాడుకున్న కరెంటుకు, వస్తున్న బిల్లుకు సంబంధం లేకుండాపోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. శీతాకాలంలో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఇంత పెద్దమొత్తంలో బిల్లు వస్తే వేసవిలో పరిస్థితి ఏమిటనే భయం అందరినీ వెంటాడుతోంది. చిరువ్యాపారులు సైతం కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్నారు. దీంతో ఆ భారంసైతం జనాలపై పడనుంది. విద్యుత్ భారాల విషయంలో ప్రభుత్వం తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపుదలపై అప్పటి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన టిడిపి, బిజెపి, జనసేన, ఇప్పుడు కూటమి కింద అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత దారుణంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయనే చర్చ జనాల్లో సాగుతోంది. సామాన్య ప్రజానీకం ఆదాయాల్లో మాత్రం పెరుగుదల ఉండటం లేదు. నిత్యావసర వస్తువుల నుంచి కూరగాయల ధరలు వరకూ అన్నింటి ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటేసిన పరిస్థితి ఉంది. కందిపప్పు, మినపప్పు వంటి ధరలు కిలో దాదాపు రూ.150 వరకూ పలుకుతున్నాయి. వంటనూనె కిలో రూ.140కుపైనే ఉంది. ఉల్లిపాయలు కిలో రూ.50కిపైనే పలుకుతోంది. ఇతర కూరగాయల ధరలు కిలో రూ.40 నుంచి రూ.80 వరకూ పెరిగిన పరిస్థితి ఉంది. మరోపక్క విద్యుత్ ఛార్జీల పెంపుతో సామాన్య ప్రజానీకం విలవిల్లాడుతోంది. పెను భారాలు మోపుతూ పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై జనాగ్రహం పెల్లుబికుతోంది. వైసిపి ఓటమికి ప్రధాన కారణం తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడమే. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అదనపు ఛార్జీల పేరుతో రెండుసార్లు విద్యుత్ ఛార్జీల మోత మోగించింది. దీంతో కూటమి ప్రభుత్వంపై జనాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సామాన్యులపై భారాలు

నాకు గత నెలలో రూ.180 కరెంట్ బిల్ వచ్చింది. ఈ నెల రూ.215 వచ్చింది. శీతాకాలం కావడంతో విద్యుత్ వినియోగం చాలా తగ్గింది. అయినా కరెంట్ బిల్ ఎక్కువ వచ్చింది. మాలాంటి సామాన్య ప్రజలపై కరెంట్ బిల్లులు పెంచుతూ భారాలు వేయడం సరైంది కాదు. కరెంట్ బిల్లులు కట్టలేక గతంలో లాగా లాంతరు పెట్టుకొని రాత్రులు గడపాల్సిన పరిస్థితి వచ్చేటట్లు ప్రస్తుత ప్రభుత్వాలు చేస్తున్నాయి.

- బి.మహమ్మద్ గౌస్, ఆలూరు.

పింఛన్ల కోతకు చర్యలు...!

- క్రిష్ణగిరి మండలం ఎరుకల చెరువులో తొలి తనిఖీ
- జనవరిలో జిల్లా వ్యాప్తంగా తనిఖీ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల కోతకు రంగం సిద్ధం చేసింది. మొదటగా సామాజిక భద్రత పింఛన్లను కోత పెట్టేందుకు చర్యలు తీసుకుంది. పైలెట్ ప్రాజెక్టు కింద క్రిష్ణగిరి మండలం ఎరుకలచెరువు గ్రామంలోని పింఛన్లను ప్రత్యేకంగా టీమ్లను ఏర్పాటు చేసి తనిఖీ చేయించారు. పింఛన్లను తగ్గించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల పట్ల లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా ద్వారా 14 రకాల పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇందులో 2,40,330 మంది లబ్ధిదారులు ఉండగా రూ. 102.55 కోట్ల మేరకు నగదును అందజేస్తున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తికాక ముందుకే పింఛన్ల సంఖ్యను తగ్గించుకునేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈనెల 8,9 తేదీలలో పింఛన్ల తనిఖీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి జిల్లాకు ఓ గ్రామాన్ని ఎంపిక చేసి తనిఖీలు పరిశీలించేందుకు ప్రత్యేక అధికార బృందాలను నియమించింది. క్రిష్ణగిరి మండలం ఎరుకలచెరువులో 349 పింఛన్లు తనిఖీ చేశారు. ఈ తనిఖీలు. 10 టీంలు భాగస్వామ్యం అయ్యాయి. కర్నూల్ ఎంపిడిఒ కార్యాలయం నుండి 5 టీంలు, కల్లూరు ఎంపిడిఒ కార్యాలయం నుండి 5 టీంలు వెళ్లి పరిశీలన చేశారు. ఒక ఆఫీసర్ ఒక వెల్ఫేర్ అసిస్టెంట్‌తో ఒకటీం 35 పింఛన్లు తనిఖీ చేసి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేసి వివరాలను పంపారు. ఈ టీంలో చేపట్టిన తనిఖీ నివేదికలను జిల్లా కలెక్టర్‌కు కూడా అందజేశారు. ఈ తనిఖీలుగా అనర్హులైన పెన్షన్లను గుర్తించి నివేదించినట్లు తనిఖీలు నిర్వహించిన టీమ్ ఓ సభ్యుడు నివేదించారు. ఈ నివేదిక ఆధారంగా పింఛన్ల తనిఖీని వచ్చే ఏడాది జనవరిలో సంక్రాంతి తర్వాత ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటుచేసి పరిశీలన చేయనున్నారు. పెద్ద ఎత్తున పింఛన్లను తగ్గించుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధమైందని సమాచారం.

క్రిష్ణగిరి మండలం ఎరుకలచెరువులో పింఛన్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

రాష్ట్ర సదస్సులో కలెక్టర్ రంజిత్ బాష

సదస్సులో పాల్గొన్న కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో బుధవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రారంభ రోజుల్లో ఓర్వకల్ పారిశ్రామికవాడను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.జిల్లాలో రోడ్ల మరమ్మతుల పరులను ముమ్మరంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు దృష్టి సారిస్తున్నామని ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

సమ్మెలో కూర్చున్న మున్సిపల్ కార్మికులు

మూడో రోజు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాల సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ భాగం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె మూడో రోజుకు చేరింది. బుధవారం సమ్మెలో ఆ సంఘం రాష్ట్ర ఉప అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగులో ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు కొనసాగిస్తామని తెలిపారు. ప్రధానంగా కార్మికులకు పర్మనెంట్ చేయాలని, జీతాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీనివాసులు, రాష్ట్రకోశాధికారి రమేష్ , జిల్లా అధ్యక్షులు ఎస్.మనోహర్, కర్నూలు నగర అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, కర్నూలు నగర నాయకులు హెచ్. యాసీన్ బేగ్, కె.జ్ఞానమ్మ, వీధి దీపాల నాయకులు శాలు, రాజు , కర్నూలు ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు పాల్గొన్నారు.

16న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎపి రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజక వృత్తి దారులకు వృత్తిపరకరాలు ఇవ్వాలని, ట్రైనింగ్ పొందిన సందర్భంగా వేతనం రోజుకు రూ.500 ఇవ్వాలని, రూ. లక్ష బ్యాంకు రుణం షూరిటీ లేకుండా ఇవ్వాలని ఈనెల 16న ఎపి రజకవృత్తిదారుల సంఘం కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా కార్యాలయంలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, జయమ్మ, న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ కౌశల్య యోజన పథకం 2023వ సంవత్సరంలో నేను ఆన్‌లైన్‌లో ప్రభుత్వం నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు శిక్షణ తీసుకున్న సందర్భంగా ప్రభుత్వం ప్రతిరోజు రూ.500 కూలిగా ఇస్తామని చెప్పిందన్నారు. ఇప్పటివరకు ఎటువంటి కూలి బ్యాంక్ అకౌంట్లో జమ కాలేదన్నారు. వృత్తి పరికరాలు ప్రభుత్వం ఇస్తామని చెప్పిన రూ లక్ష రుణాన్ని బ్యాంక్ అధికారులు ఇవ్వలేదన్నారు. బ్యాంకు అధికారులు రూ.లక్ష రుణం కావాలంటే గ్యారంటీ ఇవ్వాలని, ఏ విధంగా మీరు ప్రతి నెల బ్యాంకుకు జమ చేస్తారో చెప్పాలని నిబంధన ఉందన్నారు. కచ్చితంగా మీకు షాపు ఉంటేనే మేము రుణం ఇస్తామని బ్యాంక్ అధికారులు తిరకాసు పెట్టారన్నారు. న్యూ సిటీ అధ్యక్షుడు రాముడు, జిల్లా కమిటీ సభ్యుడు ఎల్లయ్య, నగర నాయకులు చామంతి, మధు పాల్గొన్నారు.

సిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

- సందడి చేసిన సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి
- హాజరైన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిఎంఆర్ షాపింగ్ మాల్‌ను బుధవారం ప్రారంభించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, సిఎంఆర్ షాపింగ్ మాల్ ఛైర్మన్ మావూరి వెంకటరమణతో కలిసి రిబ్బన్ కట్ చేసి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. సినీతారలు సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి సందడి చేశారు. మాల్‌లోని కలెక్షన్లను తిలకించారు. వారు మాట్లాడుతూ తెలుగు ప్రజలు తమను ఎంతగానో ఆదరించారని, వారి అభిమానాన్ని వెలకట్టలేమని అన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి నేత డి.విష్ణువర్ధన్ రెడ్డి కార్యక్రమానికి హాజరై మాల్‌లోని కలెక్షన్లను పరిశీలించారు.



-సిఎంఆర్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరిత

సిఎంఆర్ షాపింగ్ మాల్ ఛైర్మన్ మావూరి వెంకటరమణ, రాష్ట్ర అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ ఫణి మాట్లాడుతూ తమ షాపింగ్ మాల్‌లో రూ.99 నుంచే చీరలు, కుర్తీలు అందుబాటులో ఉన్నాయని, తక్కువ ధరకే నాణ్యమైన కలెక్షన్లు అందిస్తున్నామని తెలిపారు. కొనుగోలుదారులు మాల్‌కు విచ్చేసి తమకు అవసరమైన కలెక్షన్లను కొనుగోలు చేయవచ్చని కోరారు. ప్రారంభోత్సవంలో కర్నూలు స్టోర్ మేనేజర్ ప్రేమ్, మార్కెటింగ్ బృందం వెంకటరమణ, శ్రీకాంత్, మాధవ్ పాల్గొన్నారు.

ఉపాధిలో రూ.9లక్షల అవినీతి

ప్రజాశక్తి సి బెళగల్

సిబెళగల్ మండలంలో ఉపాధి తనిఖీలో రూ.906000 అవినీతి జరిగినట్లు పిడి వెంకటరమణయ్య తెలిపారు. మండలంలో 2023- 2024 సంవత్సరానికి గాను ఎస్ఆర్‌పి విజయభాస్కర్ ఉపాధి సామాజిక తనిఖీ చేపట్టి బుధవారం ఎంపిడిఒ కార్యాలయం ముందు బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఇందుకు పిడి వెంకటరమణయ్య, విజిలెన్స్ అధికారి లోకేశ్వర్, ఎపిడి అల్లిపీరా, ఎంపిడిఒ రాణెమ్మ, ఎంపిపి బొంతల మునెప్పలు పాల్గొన్నారు. డిఆర్‌పిలు పనుల వివరాలను, ఖర్చు చేసిన నిధుల జాబితాను బహిరంగ సభలో వెల్లడి చేశారు.మండలంలో రూ.15 కోట్ల 90 లక్షల నిధులకు గాను 1372 పనులను చేయించినట్లు తెలిపారు. రూ. 906000 అవినీతి జరిగినట్లు పేర్కొన్నారు. ఆ వెంటనే 49 వేలు రికవరీ చేషామని అక్రమాలుకు తావిస్తే ఎవరికైనా చర్యలు తప్పవని వారన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

-తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరం
-ప్రారంభించిన సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రాణదానంతో సమానమైన రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావలసిన ఆవశ్యకత ఉందని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. కర్నూల్ బ్లడ్ సెంటర్లో అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల సేమియా బాధిత చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కర్నూల్ బ్లడ్ బ్యాంక్ ఇంచార్జ్ డాక్టర్ రవికాంత్, అక్షయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మణిబాబు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు. యువత అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ తలసేమియా బాధిత చిన్నారుల కోసం అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. తల సేమియా బాధ్యత చిన్నారులకు తరచూ రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంటుందని, వారి ఆవశ్యకతను గుర్తించి అక్షయ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని రూపొందించడం అభినందనీయమని చెప్పారు. ప్రాణదానంతో సమానమైన రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన కోరారు. రక్తదానం పై ఉన్న అపోహలను తొలగించుకొని ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా రక్తదానం చేయాలన్నారు. ఏదేశానికైనా యువత మంచి సంపదని, అలాంటి యువత మంచి కార్యక్రమాలతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్ లాంటి వాటికి బానిసలుగా మారుతున్నారని , దీనివల్ల ఊబకాయం వంటి సమస్యలు వస్తున్నాయని, తద్వారా బిపి, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సమాజంలో యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. కర్నూలు నగరంలో నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం నిరంతరం ఉంటుందని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ వెల్లడించారు.

మెడికవర్ ఫ్యామిలీ కార్డును ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

మెడికవర్ ఫ్యామిలీ కార్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆరోగ్యం ప్రతీ ఒక్కరికీ ప్రాథమిక హక్కు అని మెడికవర్ ఫ్యామిలీ కార్డు వలన మెరుగైన వైద్య సేవలు సామాన్యులకు సైతం మరింత చేరువ అవుతాయని కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ మెడికోవర్ ఫ్యామిలీ హెల్త్ కార్డును ఆవిష్కరించారు. జెసి మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేదని చింతించకుండా కుటుంబ సంరక్షణకు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే దిశగా ఫ్యామిలీ కార్డు ఒక ముందడుగు అని తెలిపారు.అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి, అండ్ మార్కెటింగ్ హెడ్ షేక్ ఖాదర్ బాషా మాట్లాడుతూ విశ్వసనీయత ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ ఇప్పుడు తాజాగా మెడికవర్ ఫ్యామిలీ కార్డుతో ప్రతీ పేదకుటుంబానికి అత్యాధునిక పరికరాలు, సదుపాయాలతో అనుభవజ్ఞులైన వైద్యులతో ప్రజలకు అందుబాటు లోకి తెచ్చామన్నారు.

13న వైసిపి ఛలో కర్నూలు

'అన్నదాతలకు అండగా' కార్యక్రమం పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కోడుమూరు

వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతులకు అండగా వైసిపి ఉంటుందని, కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నదాతలకు అండగా వైసిపి 13న ఛలో కర్నూలు వాల్ పోస్టర్ విడుదల చేశారు. 13న రైతులకు అండగా ఛలో కర్నూలుకు వెళ్లి, రైతుల పట్ల దగా చేస్తున్న కూటమి సర్కార్ నిర్లక్ష్య వైఖరిపై కలెక్టరేట్ వరకు ర్యాలీ, వినతిపత్రం ఇస్తామన్నారు. రైతులకు మద్దతుగా చేయబోయే వైసిపి పోరాటం విజయవంతం చేయాలని నాయకులకు, కార్యకర్తలను కోరారు. జడ్‌పిటిసి రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రమేష్ నాయుడు, వేణు గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ మాదాలు, మల్లారెడ్డి, వార్డు మెంబర్ విష్ణు,సలీంబాష, శ్రీనివాసులు, లింగమూర్తి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న బుట్టా రేణుక, నాయకులు

రైతులను ముంచిన 'కూటమి'

-13న కలెక్టరేట్ ముందు నిరసన - వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని, కూటమికి తగిన బుద్ధి చెప్పాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక కోరారు. బుధవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో ఉన్న వైసిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 13న రైతులతో కలిసి కలెక్టరేట్‌ల ముందు చేపట్టే నిరసన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'అన్నదాత సుఖీభవ' అంటూ ఏడాదికి రూ.20వేలు ఇస్తామంటూ రైతులతో ఓట్లేయించుకుని.. కూటమి ప్రభుత్వం దగా చేసిందని విమర్శించారు. ఖరీఫ్ ముగిసిందని, రబీ వచ్చిందని 'అన్నదాత సుఖీభవ' సహాయం అందలేదని తెలిపారు. జగనన్న హయాంలో ఏటా క్రమం తప్పకుండా 'రైతు భరోసా' కింద ఏడాదికి రూ.13,500 అమలు చేసినట్లు చెప్పారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేసి కూటమి ప్రభుత్వం రైతును దెబ్బతీస్తోందని మండిపడ్డారు. జగన్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 10,778 ఆర్‌బికెల ద్వారా రైతులకు అనేక సేవలు అందించినట్లు తెలిపారు. అలాంటి గొప్ప వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. 2014లో కూడా చంద్రబాబు బేషరతుగా పంట రుణ మాఫీ చేస్తానంటూ కుర్చీ కోసం హామీలిచ్చి అధికారం దక్కాక రైతులకు మోసం చేశారని విమర్శించారు. మోసాలు చేయడం చంద్రబాబు నైజమని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రంగుమారిన ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలని కోరారు. ఉచిత పంట బీమాను అమలు చేసి రైతులపై భారం పడకుండా చూడాలని తెలిపారు. కర్నూలు కలెక్టరేట్ ముందు చేపట్టే నిరసనను జయప్రదం చేయాలని కోరారు. వై.రుద్ర గౌడ్, బిఆర్.బసిరెడ్డి, నజీర్ అహ్మద్, సునీల్ కుమార్, నాగేశప్ప, కేశన్న, బందే నవాజ్, కృష్ణా రెడ్డి, గడ్డం నారాయణ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, యుకె.రాజశేఖర్, శివప్ప గౌడ్, కోటేకల్ లక్ష్మన్న పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనమివ్వాలి

- మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - ఆదోని

ఇంతియాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పనికి తగ్గ వేతనం ఇవ్వాలని శాంతియుతంగా తెలుపుతున్న తమ నిరసనను ప్రభుత్వం గుర్తించకుండా తమ సహనాన్ని పరీక్షిస్తోందని, స్పందించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమన్న, అహ్మద్, శివ హెచ్చరించారు. బుధవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇంతియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపాలిటీలో ఇంజినీరింగ్, వాటర్ సప్లయి విభాగంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో దశాబ్ద కాలంగా విధులు నిర్వర్తిస్తున్నా కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. విరమణ వయస్సు దగ్గర పడిందని, ఎలాంటి ఆర్థిక ప్రయోజనమూ కలగని స్థితిలో ఉన్నామని వాపోయారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని, లేకపోతే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు పాండు, కర్రెప్ప, కృష్ణమూర్తి, కైలాష్, మహమూద్, భరత్, రామాంజనేయులు ఉన్నారు.

జెపి కింద రూ.2 లక్షల బీమా పంపిణీ

ప్రజాశక్తి - కౌతాళం

చెక్కు అందజేస్తున్న సభ్యులు

జనతా యాక్సిడెంట్ పాలసీ బీమా కింద రూ.2 లక్షల చెక్కును పంపిణీ చేసినట్లు పర్సన్ ఇన్‌ఛార్జీ రామరాజు, సొసైటీ కార్యదర్శి వెంకటేష్ పంపిణీ చేశారు. బుధవారం వారు మాట్లాడారు. స్థానిక సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రఘురామ ఈనెల 3నన పాము కాటుకు గురై మృతి చెందారని తెలిపారు. జనతా పాలసీలో నామినీగా ఉన్న అతని భార్య అనితకు బీమా చెక్కును అందజేశామన్నారు. జెపి బీమా పాలసీ ఆ కుటుంబానికి అండగా, భరోసాగా నిలిచిందన్నారు. సహకార సంఘం సభ్యత్వం తీసుకున్న వారందరికీ జెపి బీమా అండగా ఉంటుందన్నారు.

రైతు, ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు

• పంట కాలువల నిర్మాణాలు పూర్తి చేసే వరకు ఉద్యమం • సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - దేవనకొండ

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

మండలంలో రైతు, ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేస్తామని, హంద్రీనీవా పంట కాలువల నిర్మాణాలను పూర్తి చేసి ప్రతి ఎకరాకూ సాగునీరు అందించేలా ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ, బి.వీరశేఖర్ తెలిపారు. బుధవారం దేవనకొండలో మూగి తాత దర్గా కమ్యూనిటీ భవనం ఆవరణలో సిపిఎం మండల మహాసభలు సిపిఎం నాయకులు సూరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గౌస్‌దేశాయ్, నారాయణ, వీరశేఖర్ హాజరయి సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అమరులైన సిపిఎం జాతీయ నాయకులు సీతారాం ఏచూరి, సిపిఎం పల్లెదొడ్డి శాఖ కార్యదర్శి శ్రీరాముల చిత్రపటాలకు పూలమాలలు వేసి

ప్రదర్శన చేపడుతున్న నాయకులు

నివాళులర్పించారు. బస్టాండ్ ప్రాంగణం నుంచి రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభలో వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తూ వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు ఆసరాగా ఉన్న హంద్రీనీవా ప్రధాన కాలువ వెంట పంట కాలువ నిర్మాణాలను పూర్తిచేసే వరకు ఉద్యమిస్తామని చెప్పారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ బిల్లులు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం మోపిందన్నారు. సిపిఎం మండల నాయకులు రాఘవరెడ్డి, పరమేష్, యూసుఫ్ బాష, మహబూబ్ బాష, బడే సాబ్, లక్ష్మి రెడ్డి, శ్రీనివాసులు, హమాలీ నాగేష్, సుభాన్, పి.కోటకొండ పాల్గొన్నారు.

భూ తగాదాల నివారణే సదస్సుల లక్ష్యం

• బీవీ.మోహన్ రెడ్డి నగర్ ఏర్పాటు చేసి 3 సెంట్ల స్థలమందిస్తాం • ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరురూరల్

భూతగాదాల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కడిమెట్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ పాల్గొని మాట్లాడారు. గత 5 ఏళ్ల మాజీ ముఖ్యమంత్రి జగన్ ముద్దులు పెట్టి గుద్దులు గుద్దారని తెలిపారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు దింపారన్నారు. గెలిచిన 6 నెలల్లోనే ప్రజల ముందుకు వచ్చామని, గత వైసిపి ఎమ్మెల్యేలు, అధికారులు ప్రజల ముందుకొచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. రెవెన్యూ సదస్సు ద్వారా గ్రామంలో ఎంత భూమి ఉందో వివరాలు చెప్పకపోతే ప్రజలకు తెలిసేది కాదన్నారు. 7 వేల ఎకరాలు విస్తీర్ణం కలిగిన పెద్ద ఊరు కడిమెట్ల గ్రామమని, ఇందులో 2 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. కడిమెట్ల గ్రామానికి తాగడానికి స్వేచ్ఛమైన నీరు అందిస్తామని, ఇంటి పట్టాలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో తన తండ్రి బీవీ.మోహన్ రెడ్డి నగర్‌ను ఏర్పాటు చేసిన 3 సెంట్ల స్థలాన్ని ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, తహశీల్దార్ శేషఫణి, స్పెషల్ ఆఫీసర్ విజయ్ కుమార్, విరుపాక్షి రెడ్డి, చెన్నా రెడ్డి, బాల్ రెడ్డి, మురళీకృష్ణా రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, జగదీష్, పెద్దమర్రివీడు మల్లయ్య, కర్నూలు పార్లమెంట్ కురువ సాధికారిక కమిటీ మెంబర్ కెటి.వెంకటేష్, మండల మాజీ కన్వీనర్ మల్లికార్జున, మండల మాజీ ఉపాధ్యక్షులు అయ్యాలప్ప, మాజీ ఎంపిపి శంకరయ్య, కేశన్న, సోమశ్వర రెడ్డి, కడిమెట్ల చంద్ర, పాల్గొన్నారు. **హొళగుంద :** రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలు పరిష్కరిస్తామని, వచ్చిన ప్రతి వినతినీ పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ సతీష్ తెలిపారు. బుధవారం మండలంలోని నెరనికి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామం నుంచి భూ సమస్యలకు సంబంధించి 13, కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి 30 దరఖాస్తులు వచ్చాయన్నారు. డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, విఆర్ఒ ప్రహ్లాద పాల్గొన్నారు. **కౌతాళం :** గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజల వద్దకే అధికారులు వస్తున్నారని డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్, గుడికంబాలి మాజీ సర్పంచి గోపాల్ నాయక్ పేర్కొన్నారు. గుడికంబాలిలో గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. భూ సమస్యలు, ఆన్‌లైన్‌లో పేర్ల నమోదులో జరిగిన తప్పిదాలు, పొలాల హద్దులు తదితర సమస్యలు పరిష్కరించుకోవాలని కూటమి ప్రభుత్వం గ్రామ సభలను ఏర్పాటు చేసిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలు గ్రామ సభల ద్వారా పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. మండల సర్వేయర్ బసవరాజు, విఆర్ఒ నాగార్జున రెడ్డి పాల్గొన్నారు. **నందవరం** మండలం ముగతి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ శ్రీనివాసులు, మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి హాజరయ్యారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్, టిడిపి గ్రామ అధ్యక్షులు భార్గవ్ యాదవ్, డిప్యూటీ తహశీల్దార్ మహేష్, ఆర్ఐ జెర్మీయా పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ

హొళగుందలో మాట్లాడుతున్న తహశీల్దార్

కౌతాళంలో మాట్లాడుతున్న అధికారులు

నందవరంలో మాట్లాడుతున్న అధికారులు

సెకండరీ హెల్త్ డైరెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయండి

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎంసిఎచ్ హాస్పిటల్‌ను 50 పడకల నుంచి 100 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. బుధవారం విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారి శిరీషను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడారు. ఆదోని ఎంసిహెచ్ కేవలం ఆదోని పట్టణానికి మాత్రమే కాదని, ఆదోని మండలంతో పాటు 14 మండలాల ప్రజలు నిత్యం ఎంసిహెచ్‌కు వచ్చి వైద్యం చేయించుకుంటారని తెలిపారు. ఆదోని, కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో కర్ణాటక నుంచి కూడా ప్రజలు ఆస్పత్రికి వస్తుంటారన్నారు. కేవలం 50 పడకలు ఉండడంతో ఆస్పత్రిలో సరైన వైద్యం అందించలేకపోతున్నారని చెప్పారు. వెంటనే ఆస్పత్రిని వంద పడకలుగా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేసి సరిపడిన సిబ్బందిని కేటాయించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

పిడిఎఫ్ పేపర్ విలేకరిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని 'ప్రతినిత్యం' పిడిఎఫ్ పేపర్ విలేకరిగా ఉన్న ప్రకాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఆదోని వన్ టౌన్ సిఐ శ్రీరామ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ ప్రమీల రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బ్లాక్‌మెయిలింగ్, వేధింపుల కింద కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా హాస్టల్‌లో ప్రవేశించి ఫొటోలు తీసి అమౌంట్ బ్లాక్ మెయిల్ చేసినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. అమౌంటు ఇచ్చిన రసీదులు కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

శ్రీమఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. బుధవారం ఏకాదశి తిథి సందర్భంగా రాఘవేంద్రుని బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో కాషాయ వస్త్రాలతో తులసి మాలతో అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు. ఏకాదశి తిథి కావడం వల్ల స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు కూడా భోజన సదుపాయం, పరిమళ ప్రసాద విక్రయం లేకపోవడం సాంప్రదాయం.

చిప్పగిరిలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రజిని, రాముడు

కూటమితోనే గ్రామాలాభివృద్ధి

- ఎంపిటిసి రజిని, యూత్ నాయకులు పోతురాజు రాముడు

ప్రజాశక్తి - చిప్పగిరి

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో గ్రామాల్లో గతంలో లేని అభివృద్ధిని చేసి చూపిస్తున్నారని ఎంపిటిసి రజిని, టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన స్వామి, యూత్ నాయకులు పోతురాజు రాముడు తెలిపారు. బుధవారం చిప్పగిరిలో నీటి ట్యాంకు దగ్గర నుంచి ఎస్సీ కాలనీ వరకు ఉపాధి హామీ నిధులతో చేపట్టే సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపిటిసి రజిని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరిపాలన దక్షుడు.. అనుభవం ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని తెలిపారు. ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేస్తారన్నారు. ఇందులో ఎవరూ అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి జాడే లేదన్నారు. టిడిపి నాయకులు సుంకన్న, వీరాంజనేయులు పాల్గొన్నారు.

మురుగుదొడ్డి నిర్మించాలి

- కమిషనర్‌కు మహిళల వినతి

ప్రజాశక్తి - ఆదోని

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ మహిళలు

బహిర్భూమికి వెళ్లేందుకు అనుకూలంగా ఉన్న మురుగుదొడ్డి కూలిపోయిందని, ఆ స్థానంలోనే నిర్మాణ పనులు సత్వరమే చేపట్టాలని కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మహిళలు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన చేపట్టారు. కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ మాట్లాడారు. నిజాముద్దీన్ కాలనీలో తక్షణమే మురుగుదొడ్లను నిర్మించాలని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. కాలనీలో 50 ఏళ్లుగా ఉన్న మురుగుదొడ్లు ఇటీవల కూలిపోయిందని చెప్పారు. మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, మురుగుదొడ్డి శిథిలావస్థకు చేరుకుందని మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఛైర్మన్ శాంత దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు స్పందించలేదన్నారు. ప్రజల అవసరాల నిమిత్తం త్వరగా మురుగుదొడ్లు నిర్మించి వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సంక్షేమ పథకాలను వివరిద్దాం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

కూటమి ప్రభుత్వం అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ప్రతి ఒక్కరూ లబ్ధి పొంది.. స్వచ్ఛందంగా టిడిపి సభ్యత్వం స్వీకరించేలా అవగాహన పరచాలని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని కపటి గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు సభ్యత్వం నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల రాయితీలు ఇస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమ నెలకొల్పేందుకు మంచి వాతావరణం కల్పిస్తున్నారని తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని, ఆ దిశగా చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. నాయకులు రామస్వామి, రామకృష్ణ, శ్రీనివాస్ చౌదరి, మదిరే వీరేష్, పాండవగల్ అయ్యన్న, జయరాం, గ్రామ నాయకులు శివ, బాలస్వామి, జీవన్, సౌరప్ప ఉన్నారు.

సభ్యత్వం ఇస్తున్న ఉమాపతి నాయుడు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

- కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరగాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శివన్న నగర్ లే అవుట్‌లో హౌసింగ్ లబ్ధిదారులతో చర్చించారు. ఇంటి నిర్మా ణాలు శరవేగంగా పూర్తి చేస్తామని లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలు చూపించారు.

మాట్లాడుతున్న కమిషనర్ గంగిరెడ్డి

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- డీఎస్పీ ఉపేంద్ర బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. బుధవారం ఆయన గోనెగండ్లలోని పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీ నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ సిబ్బందికి విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంతో స్నేహపూర్వకంగా మెలిగి వారికి చట్ట ప్రకారం న్యాయం చేయాలని ఆదేశించారు. సిఐ గంగాధర్, స్టేషన్ రైటర్ వై.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ రైటర్ బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

'సాగునీటి' ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14న నిర్వహించబోతున్న సాగునీటి సంఘం ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తహశీల్దార్ ఇజాద్ అహ్మద్ అధ్యక్షతన ఎంపిడిఒ అల్లా బకాష్, ఎస్ఐ సతీష్ కుమార్ తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ... మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లలో నిమగ్నమవుతామని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో గట్టి నిఘా ఉంచుతున్నట్లు చెప్పారు. అన్ని పార్టీల సభ్యులతో పాటు ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు. జూనియర్ అసిస్టెంట్ వీరేష్, గోవిందప్ప, పిఆర్ ఎఇ సోమప్ప, ఇఒఆర్‌డి బాలన్న, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న మండల అధికారులు

పురస్కారం అందుకుంటున్న ఫణీంద్ర జ్యోషి

జ్యోతిష్య శిరోమణి పురస్కారంపై

గ్రహీత ఫణీంద్ర జ్యోషి ఆనందం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని తుంగభద్ర గ్రామంలో పురోహితుడైన తనకు జ్యోతిష్య శిరోమణిగా పురస్కారం లభించడం ఆనందంగా ఉందని పురస్కార గ్రహీత ఫణీంద్ర ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. తిరుమల తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో వారు జరిపిన జ్యోతిష్య మహా సభ ద్వారా గౌరవం దక్కిందన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించి వారసత్వంతో వచ్చిన జ్యోతిష్యం చెబుతున్న తనకు ఇలాంటి పురస్కారం దక్కడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇంతటి ఘన సత్కారం తుంగభద్ర గ్రామ పురోహితులు జ్యోతిష్యులకు రావడం ఆనందకరమని తుంగభద్ర బ్రాహ్మణ పండితులు అభినందనలు తెలిపారు.

ఘనంగా మారమ్మ దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నీహళ్లి గ్రామంలో బుధవారం మారమ్మ దేవర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామంలో మారమ్మ దేవర సందర్భంగా మేళతాళాల మధ్య మహిళలు కుంభాలు, కళశాలు పట్టుకుని అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. దేవర సందర్భంగా అమ్మ వారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. దేవరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు

హోమియో ఉచిత వైద్య శిబిరం

- ఎమ్మెల్యే బీవీ చేతుల మీదుగా మందులు పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కార్మికులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరులోని పాత మున్సిపల్ కార్యాలయంలో వెల్‌నెస్ హోమియో క్లినిక్ విద్య సేవా రత్న అవార్డు గ్రహీత డాక్టర్ అరుణ్ కుందవరం, ఫౌండర్ అండ్ డైరెక్టర్ జిబి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం హోమియో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి హాజరయి ప్రారంభించారు. ఎమ్మెల్యే చేతులమీదుగా 180 మంది పారిశుధ్య కార్మికులకు ఉచిత హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెల్‌నెస్ హోమియో క్లినిక్స్ ఇంటర్నేషనల్, హార్వర్డ్ ఇంటర్నేషనల్ మేడ్వర్సిటీ సిఇఒ డాక్టర్ కుందవరం వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని చెప్పారు. త్వరలోనే పట్టణ ప్రజల కోసం ఏర్పాటు చేసే కార్యక్రమంలో డాక్టర్ కుందవరం సేవలను ఉపయోగించుకుంటామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సామాజిక వేత్త, మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు పాల్గొన్నారు.

రేషన్ షాపు ఏర్పాటు చేయాలి

- కాలనీ వాసులు

ప్రజాశక్తి - మంత్రాలయం

వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మండలంలోని సూగూరు గ్రామం ఎస్సీ కాలనీలో ప్రత్యేకంగా రేషన్ షాపు ఏర్పాటు చేయాలని ఎస్సీ కాలనీ వాసులు కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ కాలనీలో సుమారు 250 మంది కార్డు లబ్ధిదారులు ఉన్నామని తెలిపారు. పాత ఊరులో 17, 18 నెంబర్ గల రేషన్ షాపులు ఉండడం వల్ల వృద్ధులు, వికలాంగులు రేషన్ కోసం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించి వెంటనే మరో రేషన్ షాపునకు అనుమతి ఇవ్వాలని కోరారు. కాలనీ వాసులు నాగరాజు, హనుమన్న, గాబ్రియేల్, నరసింహులు, రాజు, తోటయ్య, జి.రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

- జై భీమ్ యువత ఫౌండేషన్

ప్రజాశక్తి - దేవనకొండ

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మండలంలోని వెలమ కూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, భూములను కాపాడాలని జై భీమ్ యువత ఫౌండేషన్ అధ్యక్షులు ఆవుల సోమన్న కోరారు. బుధవారం పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కబ్జా చేసిన వారిపై సమగ్రమైన విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జై భీమ్ యువత ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ మునిస్వామి, టైలర్ రాజు, హాజీ, అవినాష్, సంతోష్ పాల్గొన్నారు.